# రైలుప్రయాణం

ప్లాట్‌ఫారం జనంతో కిటకిటలాడిపోతూ వుంది.

రాబోయే రైలుకూడా వీలయినంత రద్దీగానే రావచ్చునని నాకు తెలుసు. కానీ నా జాగ్రత్తలో నేనున్నాను గనుక, నాకేం భయంలేదు. పరిస్థితులెట్టి వయినాసరే, జాగరూకుణ్ని డింకీ కొట్టించలేవని నా నమ్మకం!

దీనిల్లు బంగారంగానూ, మా ఆవిడకు మాత్రం నా తెలివితేటలపైన బొత్తిగా నమ్మకం లేదు. అదే నా చింత. "ఏమండీ! మీరుచేసే దసలే రైలు ప్రయాణం. తగుదునమ్మా అని వదులొదులుగా జుబ్బా ఒకటి తొడుక్కుంటారు. దానికుండేవేమో పక్కజోబీలు. చాలని దానికి మీరింట్లో నిద్రపోయినంత నిశ్చింతగానే రైల్లోనూ నిద్రపోగలరు. ఎలాగండీ మీతో వేగడం? మీరు రైలుప్రయాణంలో

డబ్బు పోగొట్టుకుంటారని కాదండీ నా గోడు। పోతే పోతుంది. 'తిరిగిరావాలంటే యింత డబ్బు కావాలి' అని టెలిగ్రాం యివ్వడానికైనా కొంచెం డబ్బు కావాలి గదా। అదైనా మీ దగ్గర వుండకపోవడం గురించి తలుచుకుంటే నాకు ఏడుపొస్తుంది. ఏం లాభం? నేనెంతగా మొత్తుకున్నా మీరు వినిపించుకోరు...."

అదండీ వరస। ఇందాకా నేను స్టేషనుకు బయల్దేరుతుండగా మా ఆవిడ నూట ఒకటోసారిగా ఈ దండకం వల్లించింది.

నిజం చెప్పొద్దూ। మా ఆవిడ ప్రదర్శించే ఈ ధోరణివల్ల నాకు చెప్పరానంత చిరాకు కలుగుతూ వుంటుంది. ఆవిడ యిష్టం మేరకు నడుచుకోవాలంటే నేనింక జుబ్బాలు తొడుక్కోడం మానెయ్యాలి. ఒక వేళ తొడుక్కున్నా వాటికి పక్కజేబులుండకూడదు. ఇంకా మాట్లాడితే నేను శుభ్రంగా రైలుప్రయాణాలు, మరియు బస్సు ప్రయాణాలు చేయకపోవడం మంచిది. ఎందుకులెండి, జలుబు రాకుండా వుండడం కోసం ముక్కు కోసుకోమన్నట్టే వుంటాయి మా ఆవిడ సలహాలు. ఎంతటి బుద్ధిహీనుడైన భర్త అయినాసరే, అలాంటి సలహాలు పాటిస్తాడని నేననుకోను.

అయితే ఒకటి. మనిషి కెదురయ్యే అనుభవాల్లో తియ్యటివీ వుంటాయి. చేదైనవీ వుంటాయి. కొందరేం చేస్తారంటే తమ తియ్యటి అనుభవాలను మాత్రం ఏకరువుపెడతారు. చేదైన వాటిని రహస్యంగా తమ జేబుల్లో (పోనీ గుండెల్లోననుకోండి) దాచుకుంటారు. నేనలాంటి వాణ్ణిగాను. నిజాయితీ నా ముఖ్య లక్షణం. కాబట్టే ఒప్పుకుంటున్నాను. క్రితంలో ఒకటి రెండుసార్లు నేను నా జేబులోని డబ్బును పోగొట్టుకున్నమాట నిజమే। ఒకసారి టౌనుకు వెళ్ళినప్పుడు పోలీస్ గ్రౌండ్సులో నాటకం వేస్తున్నారంటే వెళ్ళాను. నేను వెళ్ళేటప్పటికి కుర్చీలు ఖాళీగా లేవు. చాలామంది వెనకవైపున నిలబడివున్నారు. రచయితెవరో. నటులెవరో నాకు తెలియదు. కానీ హీరోయిన్‌గా వేయడం కోసం మద్రాసు నుంచి వచ్చిన మెరుపుతీగలాంటి అమ్మాయివల్ల ప్రదర్శనం బాగా రక్తికడుతూ వుంది (తరువాత తరువాత ఆ అమ్మాయి సినిమాల్లో బాగా పైకి వచ్చిందిలెండి.) నా పారవశ్యంలో నేనుండిపోయి వుంటాను బహుశా. తిరిగొస్తూ చూచుకుందునుగదా. జేబులో డబ్బుల్లేవు.

ఇంకొకసారి బస్సులో ప్రయాణం చేస్తున్నాను. పరుగెత్తే బస్సులో ప్రయాణీకుల్ని ఆకట్టుకునే విషయాలు ఎన్నయినా వుంటాయి. రాజకీయాలపైన

చర్చలు. సినిమా సమీక్షలు. కండక్టరు వేసే జోకులు మొదలైనవి. మధ్యలో ఎవరో ఒకవ్యక్తి లోపలికొచ్చి. నా ప్రక్కన్నే తావుచేసుకుని కూర్చోడం గురించి నేనట్టే పట్టించుకోలేదు. చివరి స్టాపింగులో అతడందరికన్నా ముందుగానే దిగిపోవడం కూడా నేనాలస్యంగానే గ్రహించాను. తీరా నింపాదిగా దిగి చూచుకునే టప్పటికి జేబు ఖాళీగా వుంది.

సరేనయ్యా! డబ్బు పోయినప్పటికీ ఆ అనుభవాలనుంచి నేను పాఠాలు గ్రహించానా, లేదా అన్నది ముఖ్యమైన అంశం. అప్పటినుంచి. ప్రయాణానికి సిద్ధమైనప్పటి నుంచీ 'జేబులో డబ్బుంది' అన్న వాస్తవాన్ని ప్రతి రెంతు నిమిషాలకూ ఒకసారి మననం చేసుకోవడం ఒక అలవాటుగా "డెవలప్" చేసుకున్నాను. ఆ స్పృహ కలిగినప్పుడల్లా జేబు తడివి చూచుకుంటాను. ఈ జాగ్రత్తవల్ల యిక మీదట నా జేబుజోలికి రాగలిగిన దుష్టశక్తులేవీ వుండబోవని నిర్ధారించుకున్నాను.

నా ఆలోచనలో నేనుండగానే ట్రెయినొచ్చేసింది. అనుకున్నట్టు రద్దీగానే వచ్చింది. పల్లెటూరి స్టేషన్లు మాత్రం తక్కువ తిన్నాయా? చదువులకోసం వెళ్ళే విద్యార్థులు. డ్యూటీ కోసం వెడుతున్న ఉద్యోగులు. బజారు పన్లకోసం బయల్దేరిన గ్రామీణులు. సినిమాల కోసం వెడలిన మరికొందరు. యిలా ఎందరో ద్వారాల దగ్గర గజిబిజిగా మూగిపోయారు. ఎక్కేవాళ్ళు ఎక్కడానికిగానీ, దిగేవాళ్ళు దిగడానికి గానీ వీల్లేకుండా తయారైపోయిన ఒక పద్మవ్యూహంలో నుంచి వెళ్ళి పెట్టెలో కాలుపెట్టడమే బ్రహ్మ ప్రళయమైపోయింది. ఇప్పుడిక రెండో అంచె. జనాన్ని తోసుకుంటూ ఎట్లాగైనా దారిచేసుకుని ఎదురు గుమ్మం దగ్గరికి చేరుకోవడం. కంపార్ట్‌మెంట్ లోపలికి వెళ్ళేదారి అక్కడేవుంది. శ్రమపడి లోపలికివెళ్తే. రెండు పాదాలూ ఒకచోట మోపి స్వేచ్ఛగా గాలిపీల్చుకోడానికైనా వీలుండొచ్చునని నా ఆదుర్దా. ఈ ప్రయత్నంలో ఒళ్ళు హూనం కావచ్చు. దుస్తులు చిరిగిపోవచ్చు. తిట్లు విరుచుకు పడొచ్చు. అయినా అన్నింటికీ ఓర్చి కొంతదూరం ముందుకు చొచ్చుకపోయాను. ప్రతిరెండు నిమిషాలకూ ఒకసారి బుర్రలో వెలిగే బల్బును గురించి యిదివరకే మనవి చేశానుగదండీ! ఆటోమాటిక్‌గా అది వెలగడమేమిటి, నా చెయ్యి అప్రయత్నంగా జేబుపైకి వెళ్ళడమేమిటి, రెండూ ఒకేసారి జరిగాయి. కానీ అప్పటికే వ్యవహారం చెయ్యి దాటిపోయిందని తెలిసొచ్చేసరికి గుండె జల్లుమనిపించి. నేను నిశ్చేష్టుడినైపోయాను రెండు మడతలుగా మడిచిపెట్టుకున్న పది

రూపాయలనోట్లు ఎనిమిది ఒకే ఒక నిమిషంలో జేబునుంచి మటుమాయమై పోయాయి.

ఈలోగా రైలుకూడా మెల్లగా కదిలి, ముందుకు సాగబారి స్టేషను దాటింది.

"పోయింది పోయింది" అని బిగ్గరగా అరిచానేమో! అరిచేవుంటాను. గుర్తులేదు.

"ఏమిటండీ మేష్టరుగారూ! ఏం పోయింది? ఎలా పోయింది?" అని నాలుగు వైపులినుంచీ పరామర్శలు వినిపించాయి.

"ఎక్కినప్పుడు జేబులోనే వుంది. ఇప్పుడు చూసుకుంటే లేదు. ఎవరో కొట్టేశారు...." అన్నాను. నా దురవస్థను పది మందికీ నివేదన చేయడంకన్నా నా కప్పుడు గత్యంతర మేముంది?

"పొయ్యే దెక్కడికి? ఇక్కడ్నే వుంటుంది. ఎక్కినోళ్ళెవరూ దిగలేదు గదా! పరవాలేదు. మీ రూరుకోండయ్యగారూ! నేను తేల్చేస్తాను" అంటూ ఓ కోరమీసాల ఆసామి నాకు బాసటగా నిలిచి, ముందుకొచ్చేశాడు.

"ఇదిగో! అందరూ యినండి. నేను చెబుతున్నా. నేనంటే ఏమను కున్నారో! గుండెల్దీసిన బంటుని. పోయిన శుక్రవారంనాడు పాల సముద్రం బస్టాండులో నలుగురు గూండాల్ని నడ్డిరగదన్నిందెవరనుకున్నారు? నేనే. ఇప్పుడీ అయ్యగారి జేబులోనుంచీ దబ్బె త్తీసినో డెవడోగానీ. వాడిక్కడ్నే వున్నాడు. నేను రెండండే రెండు నిమిషాలు గడువిస్తున్నా. డబ్బు తెచ్చిచ్చి దండంపెట్టేస్తేసరి. లేకుంటే వాడి గతి భగమంతుడే యిచారిస్తాడు...."

ఆ క్షణాన నా పాలిటికి కోరమీసాల ఆసామి ఒక మామూలు మనిషి కాదు. ఆపద్బాంధవుడు. శిష్ట రక్షణ కోసం, దుష్ట శిక్షణ కోసం అవతరించిన నరసింహ మూర్తి. నలుగురు గూండాలనే నజ్జు గుజ్జుగా చేసి పారేసిన ఇంతటి బాహు విక్రముడు నాకు అండగా నిలిచిన తర్వాత నాదబ్బు నాకు దక్కక ఎక్కడికి పోతుంది!

అయితే యిప్పుడు దొంగ ఎవడు అన్నదే సమస్య.

నల్లటి పాంటుపైన గళ్ళచొక్కా వేసుకుని హిప్పీ క్రాపు పెంచుకున్న యువకు డొకడు దేన్ని గురించో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్టు పరాకు నటిస్తున్నాడు.

అతడు దొంగ కాకూడదా? గుమ్మం అంచున నిల్చున్న పిల్లికళ్ళవాడు తనపాటుకు తానూరుకోక మాటి మాటికీ వులిక్కిపడ్డట్టుగా వెనుదిరిగి చూస్తున్నాడు. అతగాడు దొంగై వుండకూడదా? జరుగుతున్న గొడవతో తనకేమీ సంబంధం లేనట్లు ఓ బీడీని పెదవుల నడుమ ఇరికించుకున్న గడ్డంవాలా పొగను పైకప్పుకేసి వూదేస్తున్నాడు. అతడు దొంగ కాదనుకోడానికి ఆధారాలేమున్నాయి? ఇంకా ఈ కూలీ పిల్ల. ఆ ముసలాడు. ఈ పొట్టి మనిషి- అంతెందుకు. ఇంతగా కారుబారు చేస్తున్న ఈ కోరమీసాల ఆసామి సైతం దొంగై వుండకూడదా? మొగుణ్ణికొట్టి మొగసాల కెక్కినట్టుగా యితడు తనపైన అనుమానం లేకుండా చేసుకోడానికి యిలా కపట నాటకం ఆడుతున్నాడేమో! లేదంటే గుండెపైన చేయివేసుకుని నేనొక మాట మాట మాత్రం కచ్చితంగా చెప్పగలను. అదేమిటంటే, నా మట్టుకు నేనుమాత్రం దొంగను కాను.

అయ్యో. ఎంత పొరపాటు జరిగిపోయింది! అని నాలోనేను నొచ్చుకొన్నాను మళ్ళీ భగవంతుణ్ణి సర్వజ్ఞుడంటారు. ఏం సర్వజ్ఞత చెప్పండి! లోకంలో ఎవడు దొంగో. ఎవడు దొరో. ఎవడు నీతిపరుడో. ఎవడు అవినీతి పరుడో, ఎవడు సన్మార్గుడో, ఎవడు దుర్మార్గుడో ఆమాట కాస్తా నుదుట రాసిపెట్టి వుంటే ఎంత బాగుండిపోయేది!

మన్నించాలి. పొరపాటైపోయింది. కోరమీసాల ఆసామిని అనుమానితుల లిస్టులో చేర్చడం గొప్ప అపచారం. అతడే గనుక నడుముకట్టి రంగంలోకి దిగక పోయివుంటే నేనా రోజు చేత పైసా లేకుండా వట్టి బికారివాడిలా రైలు దిగిపోవలసింది.

తాను పెట్టిన రెండు నిమిషాల గడువైపోగానే అతడు ఉప్పెనలో కదలికెరటంలా విజృంభించాడు.

"ఉండండి. ఎవళ్లూ కదలొద్దు. డబ్బెక్కడుందో కనిపెట్టలేకపోతే నా పేరు చింతపల్లి ఎల్లయ్యే కాదు! మేస్టరుగారు ఆ వైపు నుంచీ లోపలికొచ్చారు. ఆయన వెనకంటి లోపలికొచ్చినోళ్ళు యింకా ఆ బారెడు జాగాలోనే వున్నారు. ఒకటి.... రెండు.... మూడు.... మొత్తం పదారుమంది. ఈ పదారుమందిలోనూ ఎవళ్ళో ఒకళ్ళు దొంగలై వుంటారు. ఊరికే మాటలెందుకు? ఒక్కొక్కర్నీ సోదాచేస్తే సరి! ఇదుగో అమ్మీ! నీ చేతిసంచిలో ఏముందో చూపించు...."

పన్నెండేళ్ళ పల్లెటూరి పిల్ల. చింతపల్లె ఎల్లయ్య జబర్దస్తీ ముందర సుడిగాలిలో అవిసెమొక్కలా గజగజలాడిపోయింది. "ఇ....యియ్ ఈ...." పెదవులైతే కదులుతున్నాయేగానీ మాట సరిగ్గా పెగలటంలేదు.

"ఏమిటో సరిగ్గా చెప్పు."

"ఈయన సేతిలో సూసినా. అన్నీనోట్లే. గబుక్కున గుప్పిటి మూసేసినాడు...."

ఎల్లయ్య కోపానికిప్పుడు అవధులు లేకుండాపోయాయి.

"ఒరేయ్ దొంగ మాదర్చోద్ ! చెప్పు. డబ్బుయెక్కడుందో చెప్పు. ఎక్కడ దాపెట్టినావో చెప్పు. చెప్పకపోయినావో, గొంతు మలిమేస్తా కనుగుడ్లు పీకేస్తా...."

ఎల్లయ్య కోపాగ్నికి దొరికిన ఇంధనం కాలుతూ కాలుతూ వుంది. వానలో తడిసి ఆరిపోయిన నల్లతుమ్మమొద్దులా వున్నాడు. కట్టుకున్నపంచె, వేసుకున్న బనీనూ కూడా ఒకప్పుడు తెల్లటివే అయినా, యిప్పుడు నల్లగా మాసి అతడి శరీరచ్ఛాయతో కలిసిపోయాయి. నోరు తెరిస్తే కనిపించే పళ్ళు కూడా ఎగతెగకుండా వక్కాకు నమలడంవల్ల ఆరిగి, నలుపుతిరిగి వీలయినంత వికారంగా వున్నాయి. ఎండి ఎండి చుంఁడిపోయి శిరస్త్రాణంలా అంటిపెట్టుకున్న తలవెంట్రుకల్ని అతడి ఆకారానికల్లా "హైలైట్" అని చెప్పొచ్చు. తలత్రిప్పి వెనుకవైపున నిల్చున్న అతణ్ణి చూచినప్పుడు నాలోనేను నొచ్చుకున్నాను. ఈసారి భగవంతుణ్ణి గురించికాదు. నా గురించి. ఏ విధంగా చూచినా అనుమానితుల జాబితాలో మొదటిస్థానం యివ్వదగ్గవాడు యింత చేరువలో వుండగా, యితణ్ణి "ఓవర్‌లుక్" చేసి ఆ స్థానాన్ని మరెవ్వరికో యివ్వడం ఎంత అన్యాయం !

"నాకు తెలియదు. ''నేనెత్తుకోలేదు?" అన్న భావం వ్యక్తం చేయడం కోసం ఆతడేవో మాటలైతే పల్లించాడు గానీ ఆ మాటలేవీ తెలుగు భాషకు చెందినవి కావు. అందువల్ల అతగాడు తెలుగువాడై వుండకపోవచ్చుననిపించింది. అయినా నేరాన్ని ఒప్పించడంలో భాషతో అవసరమేముంది? దానికి భుజబలమే చాలు, కానీ నేరం నిరూపణగాని పరిస్థితిలో దాన్ని పూర్తిగా ప్రదర్శించే

అవకాశం చింతపల్లి ఎల్లయ్యకు లేకపోయింది. నేరస్తుడుగా పేర్కొనబడుతున్న వ్యక్తిదగ్గర అతడి శరీరమూ, దానికి ఆచ్ఛాదనంగా కొద్దిపాటి బట్టలు తప్పితే ఇతర వస్తువు లేవీ లేవు. ఎల్లయ్య అతడి బనీను మడతలన్నీ గాలించేశాడు. పంచెలో చెక్కి పెట్టుకున్నాడేమోనని నడుముచుట్టూ పరిశీలించేశాడు. డబ్బుజాడ కనిపించక పోయేసరికి అతడికి మతిపోయినంత పనైపోయింది. "చెప్పు. ఎక్కడ దాపెట్టి నావో చెప్పు" అంటూ నిట్రాయిలా నిలబడివున్న ఆ వ్యక్తిని నిలువుగా వూగించి పారేశాడు. నిలవరించుకోలేక అతడు ముందుకు తూలి, మళ్ళీ యధాస్థితికి వచ్చే దశలో "అదిగో డబ్బ"ని ఎవరో అరిచారు. ఏ ప్రచ్ఛన్న భాగంలో నుంచో జారి పడిన డబ్బును చేతికి తీసుకుంటూ ఎల్లయ్య విజయగర్వంతో ఉప్పొంగిపోయాడు. ఇప్పుడింక దండనమే తరువాయి! అది నిరాఘాటంగా సాగిపోతోంది. ముద్దాయి "కుయ్యో, మొర్రో" అని అరుస్తున్నాడు. "వద్దొద్దు. చస్తాడేమో! చాల్చాలు" అని ఎవరైనా వారించినప్పుడు ఎల్లయ్య కాస్త శాంతిస్తున్నాడు. చావలేదని తెలిసొచ్చే సరికి మళ్ళీ పుంజుకుంటున్నాడు.

పోయిందనుకున్న నా డబ్బు పోలేదు. గట్టి సంపాదన కనుక మళ్ళీ నాకు దక్కింది. ఈలోగా నాకెవరో కూర్చోడానికి కిటికీదగ్గర తావుకూడా చూపించారు. తనకంటూ సమస్యలు లేనప్పుడు వున్న సమస్యలు తీరిపోయినప్పుడు మానవుడి కెంతయినా సంతృప్తి కలుగుతుంది. ఆ సంతృప్తిలో తేలిపోతూ నేను కిటికీదగ్గర కూర్చున్నాను.

జనం నడుమనుంచీ నిందితుడు కొలిమి తిత్తిలా రొజుకుంటూ వుండడం నాకు వినిపించింది. కాలిన యినుముపైన సమ్మెట దెబ్బలు పడినట్టుగా వుండీవుండీ అతడిపైన పిడిగుద్దులింకా పడుతూనే వున్నాయి.

"అయ్యో పాప"మని ఎవరో జాలిపడడం కూడా నేను విన్నాను. తనది కాని వస్తువును యితరులకు తెలియకుండా కాజేసే నేరాన్ని దొంగతనమంటారు. ఈ పనివల్ల సంఘంలో శాంతి భద్రతలు క్షీణిస్తాయి. అలాంటప్పుడు ఒక సమాజ విద్రోహిపట్ల సభ్యమానవులు సానుభూతి చూపించడం నాకు విడ్డూరంగా తోచింది.

ప్రక్క స్టేషన్లో రైలాగింది.

"తిన్నదెబ్బలు చాల్లే! ఇక్కడుంటే చస్తావు. వెళ్ళు, వెళ్ళు" అంటూ ప్రయాణీకులు కొందరు నేరస్తుణ్ణి ప్లాట్‌ఫారంపైకి తోసేశారు.

''ఇదుగోండయ్యగారూ. మీ డబ్బు'' అంటూ కోరమీసాల ఎల్లయ్య తన చేతిలోని డబ్బును నా దోసిట్లో వేసేసాడు.

ఎల్లయ్య నా కంద జేసిన డబ్బువైపు నేను మళ్ళీ మళ్ళీ చూచుకున్నాను. ఒకటికి రెండుసార్లు ఒక్కొక్క నోటుగా లెక్కపెట్టుకున్నాను. ఎనిమిది పదిరూపాయల నోట్లతోబాటు, అదనంగా ఒక యాభై రూపాయలనోటు, యింకొక ఇరవై రూపాయల నోటు, కూడా ఇప్పుడు నా చేతిలో వున్నాయి. కొద్ది నిమిషాల వ్యవధిలో డబ్బు పిల్లల్ని పెట్టగలదన్న విషయంలో నాకు నమ్మకం లేదు. అయినా నా దగ్గరికి తిరిగి వచ్చిన మొత్తాన్నిబట్టి చూస్తే అనుకోవలసివున్నట్టే తోచింది.

ఇంతలో గార్డు విజిల్ వేశాడు। స్టేషనులో మోగిన గంటతోబాటుగా రైలు కూడా కదిలింది.

కదిలిన బండిలోనుంచి నేనెందుకు వెలుపలికి తొంగిచూశానో చెప్పలేను. ప్లాట్ ఫారంపైన వేపచెట్టు చాటున నిల్చున్న జేబుదొంగ కూడా అదే క్షణంలో నావైపు చూడడం కేవలం యాదృచ్ఛికం। సూటిగా దూసుకొచ్చిన అతడిచూపులు సూదుల్లా నా ముఖాన గుచ్చుకున్నాయి. ఛీఛీ, ఏం మనిషండీవీడు। సమాజమనేది ఒక రైలుబండి లాంటిదనీ. పరువు ప్రతిష్ఠలన్న టికెట్టున్న వారే అందులో దర్జాగా పయనించగలరనీ. అది లేనివాళ్ళచోటు ప్లాట్ ఫారమేనని ఆ దొంగ వెధవకేం తెలుస్తుంది?

ఎందుకైనా మంచిదని ఒకసారి నేను జేబు తడివి చూచుకున్నాను. అలా చూచుకుంటున్నప్పుడు ఒక చిరునవ్వు నా పెదవులపైన పారాడిపోయి వుండొచ్చునని నా అనుమానం. ఎలాగైనా ఒక్కొక్కప్పుడు రైలు ప్రయాణం కూడా లాభసాటి బేరమే।